
సాక్షి ఒడిశా

శనివారం । 29 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.88,323
బంగారం	6 గ్రాముల 50 మిల్లీ గ్రాములు
వెండి	5 గ్రాముల 850 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



మంటల్లో మో బస్సు

మో బస్సు మంటల్లో చిక్కుకుంది. పెను ప్రమాదం తృత్రుటిలో తప్పిపోయింది.

- 8లో



లక్ష్మీ బస్సు సేవలు మృగ్యం

లక్ష్మీ బస్సు సేవలు మృగ్యమైపోయాయి. పర్మిట్లు లేక మూలన చేరాయి.

- 8లో

న్యూస్‌రీల్

ఉప రాష్ట్రపతితో ముఖ్యమంత్రి భేటీ



ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి న్యూఢిల్లీ పర్యటన సందర్భంగా భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు.

- భువనేశ్వర్

పీఎఫ్ సమస్యలపై విన్నపం



కేంద్ర పీఎఫ్ కమిషనర్ స్వతంత్ర పర్యవేక్షకులు శైలేంద్ర సింగ్‌ను కలిసి శ్రామిక సమస్యలు వివరిస్తున్న నేతలు

జయపురం: కొరాపుట్ జిల్లా సునాబెడ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)టీటీఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్రం పీఎఫ్ కమిషనర్ స్వతంత్ర పర్యవేక్షకులు శైలేంద్ర సింగ్‌ను జయపురం గగణాపూర్ పేవా పేపర్ మిల్లు శ్రామిక నేతలు కలిశారు. ఈ సందర్భంగా పింఛన్లు, పీఎఫ్ సమస్యలపై చర్చించారు. పేపర్ మిల్లు ప్రథమ కార్మిక యూనియన్ అధ్యక్షుడు ప్రమోద కుమార్ మహంతి నేతృత్వంలో పలువురు శ్రామిక నేతలు శైలేంద్ర సింగ్‌ను కలిశారు. సేవా పేపరు మిల్లును చేపట్టిన మథర్ ఎర్త్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 2020 ఏప్రిల్ నుంచి శ్రామికులకు పీఎఫ్‌లు వేయడం లేదని ఆరోపించారు. శ్రామికులకు పెన్షన్ సౌకర్యం కల్పించటం లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మరణించిన శ్రామిక కుటుంబాలకు ఈడీఎల్ఆర్ సౌకర్యం లభించడం లేదని, బకాయిలు కూడా రావాల్సి ఉందని పేర్కొన్నారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. శైలేంద్ర సింగ్‌ను కలిసిన వారిలో శ్రామిక నేతలు బసంత బెహర, ప్రహ్లాద్ మల్లిక్, దత్త ప్రసాద్ అగస్థ తదితరులు ఉన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతో ఎమ్మెల్యే నర్సింగ బోత్ర



ఎమ్మెల్యే నర్సింగ బోత్రతో స్థానికులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా జోరిగాం ఎమ్మెల్యే నర్సింగ బోత్ర సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకున్నారు. గురువారం జొరిగాం చేరుకోగానే స్థానికులు, బీజేపీ కార్యకర్తలు వెళ్లి పలకరించారు. గత కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతూ ఎమ్మెల్యే భువనేశ్వర్‌లోని క్యాపిటల్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అపెండిక్స్ వ్యాధిగా వైద్యులు గుర్తించి చికిత్స చేశారు. పూర్తిగా కోలుకోగానే స్వస్థలం చేరుకున్నారు. మధ్య తరగతికి చెందిన నర్సింగ బోత్రకి బీజేపీ టిక్కెట్ కేటాయించింది. ఊహించని విధంగా గెలుపొంది ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిపై పార్టీ వర్గాలు వాకబు చేశాయి.

ప్రభుత్వ కొత్త ప్రముఖ కార్యదర్శిగా మనోజ్ ఆహుజా



భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ కొత్త ప్రముఖ కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి మనోజ్ ఆహుజా శుక్రవారం నియమితులయ్యారు. కేంద్ర సర్వీసు నుంచి స్వరాష్ట్రానికి వచ్చిన మనోజ్ 1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుత ప్రముఖ కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా 6 నెలల పొడిగింపు ముగియడంతో ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో మనోజ్‌ను నియమిస్తున్నట్లు ప్రభుత్వ, సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు మాతృ కేడర్‌కు స్వరాష్ట్రానికి రావడానికి ముందు ఆహుజా వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. కేంద్రంలో జాయింట్ డైరెక్టర్ సిబ్బంది శిక్షణ, సిబ్బంది, సాధారణ పాలన, రాష్ట్రంలో ఉక్కు, గనులు, క్రీడలు - యువజన వ్యవహారాల విభాగాల్లో కమిషనర్ కమ్ సెక్రటరీ వంటి అనేక ఉన్నత పదవులు నిర్వహించారు. కేంద్ర మాధ్యమిక విద్యా బోర్డు (సీబీఎస్ఈ), విద్యా విభాగం చైర్మన్‌గా కూడా పని చేశారు.

జగన్నాథుడి దర్శనానికి.. స్లాట్ బుకింగ్!



- ప్రతిపాదన దశలో ఉందన్న పూరి గజపతి మహారాజా
- భక్తుల రద్దీ క్రమబద్ధీకరణకు దోహదం



దివ్య సింగ్ దేవ్

భువనేశ్వర్: పూరీలోని జగన్నాథ దేవస్థానం నాలుగు ద్వారాలు తెరిచిన తర్వాత భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. ఈ రద్దీ క్రమబద్ధీకరించేందుకు రత్నవేదికపై దేవతల దర్శనం కోసం స్లాట్ బుకింగ్‌ను ప్రవేశపెట్టాలని శ్రీ మందిరం పాలక మండలి యోచిస్తోందని పాలక మండలి అధ్యక్షుడు పూరి గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్ శుక్రవారం తెలిపారు. మూలవిరాట్టుల దర్శనానికి శ్రీ మందిరం లోనికి ప్రవేశించడానికి ఆన్‌లైన్‌లో స్లాట్‌ల నమోదు ప్రతిపాదన ప్రారంభ దశలో ఉందని పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే సందర్శకుల రద్దీని నిర్వహించడంలో ఈ విధానం దోహదపడుతుందన్నారు. దర్శనం కోసం దీర్ఘకాలం వేచి ఉండే సమయాన్ని తగ్గించడానికి ఈ వ్యవస్థ సహాయపడుతుందని చెప్పారు. కొన్ని సందర్భాల్లో 3 గంటల పాటు స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరాల్సి వస్తుందని, ఆన్‌లైన్‌లో నిర్దిష్ట సమయాన్ని ఎంచుకుంటే భక్తులు శ్రీ క్షేత్రంలో ఇతర ప్రదేశాలను కూడా సకాలంలో సందర్శించేందుకు అవకాశముంటుందన్నారు.

ప్రత్యేకంగా మొబైల్ యాప్..

భక్తులు ముందుగానే దర్శన స్లాట్‌లను రిజర్వ్ చేసుకోవడానికి అనుకూలించే మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు దివ్య సింగ్ దేవ్ పేర్కొన్నారు. అయితే ఇంతవరకు ఈ విషయమై ప్రభుత్వ వైఖరి స్పష్టం కాలేదన్నారు. యాప్ అందుబాటులోకి వస్తే భక్తులు స్వయంగా మొబైల్ ఫోన్ ఉపయోగించి స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చన్నారు.

సంప్రదింపులు జరిపాకే..

భక్తుల సౌలభ్యం కోసం పూరి గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్ ప్రతిపాదించిన స్లాట్ దర్శనం యాప్ పట్ల ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉన్నట్లు అనుబంధ వర్గాలు తెలిపాయి. తుది నిర్ణయం తీసుకునే ముందు వాటాదారులను సంప్రదిస్తామని, కొత్తగా ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

స్వాగత కేంద్రం, క్లాక్‌రూమ్‌లు..

కోవిడ్ 19 తదనంతరం శ్రీ మందిరం ప్రాకార పథకం ప్రారంభోత్సవం నుంచి క్రమంగా పెరిగిన భక్తుల రద్దీ శ్రీ మందిరం నాలుగు ద్వారాల గుండా భక్తుల ప్రవేశం అనుమతించడంతో మరింతగా పుంజుకుందని, ఈ సమయంలో భక్తుల రద్దీని నియంత్రించాల్సిన అవసరం ఉందని దివ్య సింగ్ దేవ్ అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఆలయానికి సమీపంలోనే 2000 నుంచి 3000 మంది భక్తులకు వసతి కల్పించేలా భారీ స్వాగత కేంద్రాన్ని, క్లోక్‌రూమ్‌తో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రతిపాదన వచ్చిందన్నారు. నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీ కూడా దీనికి పచ్చజెండా ఊపిందన్నారు. ఆలయం లోపల రద్దీని నివారించడానికి స్క్రీనింగ్ తర్వాత వారిని లోపలికి అనుమతిస్తామని ఆయన చెప్పారు.

పూరి రథయాత్రకు 315 ప్రత్యేక రైళ్లు



రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఉప ముఖ్యమంత్రులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి భేటీ

భువనేశ్వర్: ఈ ఏడాది జరగనున్న పూరి శ్రీ జగన్నాథుని వార్షిక రథ యాత్రకు రైల్వే శాఖ 315 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం నాలుగు రోజుల న్యూ ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఇరువురు ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడాలతో సమావేశమైన తర్వాత అశ్విని వైష్ణవ్ ఈ విషయాన్ని ప్రకటించడం విశేషం.

రథయాత్ర సందర్భంగా రైల్వే శాఖ చేయాల్సిన ఏర్పాట్లపై చర్చలు నేపథ్యంలో 315 ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించారు. ఇది గత సంవత్సరం కంటే చాలా ఎక్కువ. ఈ రైళ్లు ఒడిశాలోని దాదాపు అన్ని ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తాయి. దాదాపు 1,500 మంది భక్తులు ఉండేందుకు వీలుగా రైల్వే శాఖ ఆధ్వర్యంలో డేరాలు వేస్తారని రైల్వే మంత్రి తెలిపారు.

ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రైల్వే, సాంకేతిక సమాచారం, ప్రసారం శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. రాష్ట్రంలో మరింత మెరుగైన రైల్వే వ్యవస్థ కోసం రైల్వే మంత్రితో వివరంగా ముఖ్యమంత్రి చర్చించారు. దీనితో పాటు సాంకేతిక సమాచార రంగంలో అభివృద్ధితో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను ఎలా సృష్టించాలనే దానిపై కూడా చర్చించినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చారు.

మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జుయల్ ఓరం, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌లను కూడా కలిశారు. ఒడిశా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోహన్ చరణ్ మాఝి దేశ రాజధానికి వెళ్లడం ఇదే తొలిసారి.

‘మహిళా జర్నలిస్టుపై దాడి సరికాదు’



జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన పర్లాకిమిడి ప్రెస్ క్లబ్ సభ్యులు

పర్లాకిమిడి: భువనేశ్వర్‌లో ఒక మహిళా జర్నలిస్టుపై మాజీ మంత్రి రఘునందన్ దాస్ తన కుక్కలను ఉసిగొల్పిన సంఘటనపై పర్లాకిమిడి ప్రెస్‌క్లబ్ సభ్యులు ఖండించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గత మంగళవారం భువనేశ్వర్‌లో ఎమ్మెల్యే ప్రణబ్ ప్రకాష్ దాస్ ఇంటి వద్ద ఇళ్లను ధ్వంసం చేస్తున్న ఘటనను ఒక మహిళా జర్నలిస్టు, ఆమె కెమెరామెన్ చిత్రీకరించారు. అయితే హఠాత్తుగా ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉన్న మాజీ మంత్రి రఘునందన్ దాస్ తన ఇంటి ముందు ఎందుకు వీడియో తీస్తున్నారని అరుస్తూ తన అనుచరులతో కుక్కలను వారిపై ఉసిగొల్పారు. దీంతో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు. మాజీ మంత్రి రఘునందన్ దాస్‌పై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని పర్లాకిమిడి ప్రెస్ క్లబ్ కలెక్టర్‌కు ఒక వినతి ఇచ్చారు. ఆందోళనలో దేవాషిష్ పాఢి, బసంత పండా, బాసుదేవ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో విభేదాలు లేవు

- కొరాపుట్ ఎంపీ ఉల్క



కొరాపుట్: కాంగ్రెస్ శాసన సభ పక్ష పార్టీ అధ్యక్ష స్థానం ఎంపికలో ఎటువంటి విభేదాలు లేవని కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క స్పష్టం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఉల్క వర్గం, జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి వర్గం ఈ పదవి కోసం వర్గ పోరు జరుపుతున్నాయనే వాదనతో ఇటీవల విభిన్న పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఉల్క, బాహిణీపతిలు వేర్వేరుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో వీటిని ఊటంకిస్తూ ఉల్క ప్రతిస్పందించారు. ఈ పదవిపై పత్రికల్లో వచ్చే కథనాలు సత్య దూరరమని, ఊహాజనితంగా కొట్టిపడేశారు. తమలో ఎటువంటి గ్రూపులు లేవన్నారు. తాము కేవలం పార్టీ హైకమండ్ ఆదేశాలు మాత్రమే శిరసావహిస్తామన్నారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ అని ఎంపీ ఉల్క ఘంటా పథంగా ప్రకటించారు.

డీఎల్‌వోపై సస్పెన్షన్ వేటు



జాస్మిన్ శుభదర్శని సాహు (ఫైల్)

రాయగడ: జిల్లా కార్మిక శాఖ అధికారి జాస్మిన్ శుభదర్శని సాహు సస్పెన్షన్ వేటుకు గురయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్మిక శాఖ గురువారం సాయంత్రం ఈ ఉత్తర్వులను జారీ చేసింది. కార్మిక శాఖ కార్యాలయంలో అవినీతి చోటుచేసుకుందన్న ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన సంబంధిత శాఖ, అధికారుల నివేదిక ఆధారంగా ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ విభాగంలో సుమారు రూ.80 కోట్ల వరకు అవినీతి చోటు చేసుకుందని పత్రికల్లో వచ్చిన కథనాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. నిర్మాణ శ్రామికులకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో ఆమె అవినీతికి పాల్పడిందనేది ఆరోపణ.

మద్య నిషేధం చేయాలని వినతి



మద్య నిషేధం కోసం ఫిర్యాదు చేస్తున్న మహిళలు

కొరాపుట్: తమ ప్రాంతంలో మద్య నిషేధం చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కేంద్రం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బెంగాలీ శరణార్థులు అధికంగా ఉండే రాయిఘర్, జంకర్, రాయిఘర్ సదర్ ప్రాంతాల్లో అక్రమ మద్యం ఏరులై పారుతోంది. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారని మహిళలు వాపోయారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి నిత్యానంద గోండొ రాష్ట్రంలో మద్య నిషేధం దశలవారీగా చేయడానికి కసరత్తు చేస్తున్నామని ప్రకటించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాపులు, బార్‌ల లైసెన్స్‌ల గడువు పెంపు కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ని తాజాగా విడుదల చేసింది. అటు మంత్రి ప్రకటన, ఇటు నోటిఫికేషన్ వరుసగా జరగడం గమనార్హం. ఇదే సమయంలో రాయిఘర్ మహిళలు మద్య వ్యతిరేక పోరాటంకి దిగడంతో చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విక్రమదేవ్ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సాహితీ సామ్రాట్ సేవలు చిరస్మరణీయం



విక్రమ్‌దేవ్ ఆర్ట్స్ క్రాఫ్ట్ కళాశాలలోమహారాజు విక్రమదేవ్‌కు నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

జయపురం: జయపురం మహారాజు సాహితీ సామ్రాట్ విక్రమదేవ్ వర్మ ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల ప్రజల వారధి అని పలువురు వక్తలు కొనియాడారు. సాహిత్య సామ్రాట్ రాజశ్రీ విక్రదేవ్ వర్మ 156వ జయంతి సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. జయపురం విక్రమదేవ్ ఆర్ట్స్ క్రాఫ్ట్ కళాశాల ప్రాంగణంలో గల విక్రమదేవ్ విగ్రహానికి పూల మాలలు వేసి కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఆర్ట్స్ క్రాఫ్ట్ కళాశాల ప్రిన్సిపాల్ యుధిష్టర్ మల్లిక్ ప్రసంగిస్తూ మహారాజు విక్రమదేవ్ విద్య కళారంగాలకు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన జయపురం విక్రమదేవ్ కళాశాలను నెలకొల్పి విద్యాప్రగతికి ఎనలేని సేవలు అందించారని అలాగే 1946 లో ఆర్ట్స్ కళాశాల నెలకొల్పి కళా ప్రగతికి దోహద పడ్డారన్నారు. అదేవిధంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీ స్థాపనలోనూ కీలక పాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో సుధాంశు శేఖర పట్నాయిక్, ప్రకాశ్ మహానందియ, ప్రహ్లాద పారిడ విక్రమదేవ్ వర్మ చరిత్రను విద్యార్థులకు తెలియజేశారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బహుముఖ ప్రజ్ఞాశాలి రాజశ్రీ విక్రమదేవ్ వర్మ జయంత్యుత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రాంగణంలో గల విక్రమదేవ్ వర్మ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విద్యా ప్రగతికి మహారాజు చేసిన కృషిని వక్తలు వివరించారు. ప్రధాన ఉపాధ్యాయులు ప్రకాశ్ చంద్ర పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యజ్ఞేశ్వర పండా తదితరులు పాల్గొన్నారు. విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో గల విక్రమదేవ్ వర్మ కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ దేవీ ప్రసాద్ మిశ్ర తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు.

వస్తున్నాయ్ జగన్నాథ రథ చక్రాల్



రథానికి అమర్చే గొల్లభామలకు రంగులు అద్దుతున్న కళాకారులు



రథాలకు అవసరమయ్యే జయవిజయులు, ఇతర బొమ్మలను తయారుచేస్తున్న కళాకారులు

పర్లాకిమిడి: గుండిచా రథయాత్రకు పర్లాకిమిడి రాజ వీధిలో బోడో దండా ముస్తాబవుతోంది. జగన్నాథ రథ నిర్మాణాన్ని పూర్తి చేశారు. మరో రెండు రథాలు కూడా తయారవుతున్నాయి. పూరీ, బీహార్, కోల్‌కోతా నుంచి మీనాబజార్, పూరీ చాట్ తినుబండారాలు దుకాణాల కోసం ఇప్పటికే టెండర్లు పొడారు.



శ్రీజగన్నాథ రథానికి పెయింటింగ్, బొమ్మల చిత్రీకరణ



శ్రీజగన్నాథ రథసారథి బొమ్మ



రాజవారి కోటలో రథాల ఏనుగులు, జయవిజయుల బొమ్మల తయారీ

క్లుప్తంగా

రాయగడ చేరిన కేంద్ర వైద్య బృందం



డాక్టర్ రౌత్రాయ్‌తో వైద్య బృందం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీ మునిషిపాదొరా గ్రామంలో డిఫ్తీరియా వ్యాధి బారిన పడి ఐదుగురు చిన్నారులు మృతి చెందిన ఘటనపై కేంద్ర ఆరోగ్య శాఖ స్పందించింది. వ్యాధి కారణాలను అన్వేషించేందుకు ప్రత్యేక వైద్య బృందం శుక్రవారం రాయగడకు చేరుకుంది. కేంద్ర ఆరోగ్య శాఖకు చెందిన డాక్టర్ నవీన్ పహిమోహన్ వర్మ నేతృత్వంలో డాక్టర్ అశోక్‌చక్రవర్తి, డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్ ఆరతి నంద, ఎపిడమోలజీ డాక్టర్ ఆరబను ఘాయ్, సైంటిస్ట్ డాక్టర్ భట్టాచార్యులు శుక్రవారం జిల్లా ముఖ్య వైద్యధికారి డాక్టర్ లాల్‌మెహన్ రౌత్రాయ్‌తో సమావేశమై సమగ్ర సమాచారం తెలుసుకున్నారు. 20 ఏళ్ల తర్వాత వ్యాధి ప్రబలడంపై ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మునిషిపాదొరాలో పర్యటించి వాస్తవాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తారని సమాచారం.

● జంటలను కలిపి.. బతుకులను నిలిపారు



కోటబొమ్మాళి కోర్టులో దండలు మార్చుకున్న దంపతులతో జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత, న్యాయవాదులు, పెద్ద మనుషులు

నిండు నూరేళ్లు కలిసి జీవించాల్సిన భార్యాభర్తలు తమ వైవాహిక జీవితంలో చిన్నపాటి తగాదాలతో పట్టుదలకు పోయి ఏకంగా విడిపోవాలనుకున్నారు. దీని కోసం కోర్టుకు సైతం వెళ్లారు. కానీ వారందరికీ నచ్చజెప్పి మళ్లీ కలిసి జీవించేలా చేశా రు కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత. శుక్రవారం కోర్టు హాల్‌లో ఈ వాదోపవాదాలు జరిగాయి. వివరాల్లోకి వెళితే..
శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని నరసన్నపేట, అంపోలు, చెన్నయ్యవలస, కోటబొమ్మాళి గ్రామాలకు చెందిన రఘుపాత్రుని శోభారాణి-రవిశంకర్, పైలా అప్పన్న-రాజేశ్వరి, బొమ్మాళి వేణుగోపాల్-వరలక్ష్మి, ముద్దాడ గోపాలం-లక్ష్మీ విడాకుల కోసం కోటబొమ్మాళి కోర్టును ఆశ్రయించారు. మెజిస్ట్రేట్ ప్రసన్నలత శుక్రవారం వారిని కోర్టుకు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అందరికీ చక్కగా నచ్చజెప్పి మళ్లీ కలిసి జీవించేలా ఒప్పించారు. దీంతో ఐదుగురు దంపతులు మళ్లీ పూలదండలు మార్చుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించారు. దీంతో కోర్టులో న్యాయ వాదులు, సిబ్బంది, పెద్ద మనుషులుగా వచ్చిన వారు హర్షం వ్యక్తం చేశారు. జంటలను ఒక్కటి చేసిన మెజిస్ట్రేట్ అభినందించారు. కార్యక్రమంలో ఏపీపీ డి.హరిప్రియ, ఏజీపీ ఎస్.తిరుపతి, బార్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, న్యాయవాదులు పల్లి వాసుదేవ రావు, కె.అచ్చెన్నాయుడు, వి.అప్పలనాయుడు, సీహెచ్ వెంకటరావు, యు.తిరుమల రా వు, కె.మన్మధరావు పాల్గొన్నారు.

–కోటబొమ్మాళి

‘శివారుకు వంశధార నీరివ్వాలి’

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వంశధార కాలువలకు షట్టర్స్ బిగించి శివారు భూములకు నీరివ్వాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శ వర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని డీసీసీబీ కాలనీలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. వంశధారలో నీరున్నప్పటికీ రైతులకు నీరందకపోవడానికి కారణం పాలకుల నిర్లక్ష్యమేనన్నారు. 900 టన్నుల షట్టర్స్ గోదాంలో మూలుగుతూ తుప్పు పడుతున్నాయని, వాటిని ఎందుకు బిగించడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. వంశధార ఎడమ కాలువకు కొత్త షట్టర్స్ బిగించకుండా శివారు భూములకు నీరు ఎలా ఇస్తారో చెప్పాలన్నారు. వంశధార ఎడమ కాలువ పొడవు 105 కిలోమీటర్లు అందులో 60 కిలోమీటర్లు హిరమండలం నుంచి టెక్కలి వరకు ఉన్న అన్ని షట్టర్స్, మధుములు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వాటికి తక్షణమే మరమ్మతులు చేయకపోతే కాలువలో నీరు వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఎడమ కాలువకు 68 పిల్ల కాలువలు, కుడికాలువకు 37 పిల్ల కాలువలు పూర్తిగా మరమ్మతుకు నోచుకోలేదని విమర్శించారు. వంశధార కాలువను ఆపరేట్ చేయడానికి గతంలో 200 మంది లష్కర్లు ఉండేవారని నేడు 20 మంది మాత్రమే ఉన్నారని దీంతో కాలువ మెయింటెనెన్స్ కూడా జరిగే పరిస్థితి లేదన్నారు. జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వంశధారాపై పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. వంశధార బ్యారేజ్ పూర్తయి 50 ఏళ్లు అయ్యిందని మెయింటెనెన్స్‌కు నిధులు కేటాయించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం 50 ఏళ్లు పూర్తయిన ప్రాజెక్టులకు ఆధునికీకరణ చేయాల్సి ఉన్నా పట్టించుకోకుండా ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వంశధార కాలువల ఆధునికీకరణకు సుమారు రూ.1000 కోట్లు అవసరం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కొత్త షట్టర్స్ బిగించి, ఆధునికీకరణ చేసి మధుములు, కాలువలు మరమ్మతులు చేయాలని కోరారు. లష్కర్లను నియమించి కొండపేట ఎత్తిపోతలకు పథకం మరమ్మతులు చేసి నీరివ్వాలని డిమాండ్ చేశారు.

మంటల్లో ‘మో బస్సు’

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- ప్రయాణికులంతా సురక్షితం



కాలిపోయిన బస్సు

భువనేశ్వర్: ప్రయాణికులతో వెళ్తున్న మో బస్సు అకస్మాత్తుగా మంటల్లో చిక్కుకుంది. డ్రైవర్ సమయ స్ఫూర్తితో వ్యవహరించడంతో ఘోర ప్రాణహాని తప్పింది. ఈ విచారకర సంఘటన కటక్ నగరం సీడీఏ సెక్టార్-9 వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. బస్సులో మంటలు చెలరేగిన వెంటనే డ్రైవర్ సకాలంలో స్పందించి ప్రయాణికులంతా దిగిపోవాలని చెప్పడంతో పెను ప్రమాదం తప్పింది. పూరీ నుంచి బయల్దేరిన మో బస్సు కటక్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మంటలను గమనించిన డ్రైవర్ వెంటనే బస్సు దిగాలని ప్రయాణికులను అప్రమత్తం చేశాడు. అగ్నిమాపక దళం అధికారులు మంటలను ఆర్పే సమయానికి బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మో బస్సు ఇటువంటి ప్రమాదంలో చిక్కుకోవడం కొత్తేమీ కాదు. ఈ ఏడాది మే 20న రౌర్కెలా నుంచి వేదవ్యాస్‌కు వెళ్తుండగా ఇలాంటి ఘటన జరగడంతో మో బస్సులో మంటలు చెలరేగి తీవ్ర అలజడి రేపింది. సాంకేతిక లోపం కారణంగా అప్పట్లో ఈ ప్రమాదం సంభవించినట్లు విచారణలో తేలింది. స్వల్ప వ్యవధిలో బస్సులో మంటలు చెలరేగినట్లు గుర్తించారు. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికుల ప్రాణాలు నిలిచాయని నివేదిక పేర్కొంది. తాజా ఘటన కూడా ఇదే తరహాలో చోటు చేసుకున్నట్లు భావిస్తున్నారు.

మహ్మద్ బాజీకి ఘనంగా నివాళి



నబరంగ్‌పూర్ స్వాతంత్ర్య సమర యోధుడు మహమ్మద్ బాజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

కొరాపుట్: దివంగత స్వాతంత్ర్య సమర యోధుడు మహ్మద్ బాజీ 6వ వర్ధంతి గురువారం ఘనంగా జరిగింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో విజిలెన్స్ కార్యాలయం ఎదుట కార్యక్రమం జరిగింది. అక్కడ బాజీ విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బాజీది కీలక పాత్ర అని పేర్కొన్నారు. పుట్టుకతో ముస్లిం అయినప్పటికీ గాంధీ ఆశయాల కోసం ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్నారని తెలిపారు. జీవితాంతం శాకాహారిగా జీవించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, మున్సిపల్ చైర్మన్ కును నాయక్, డీసీసీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి, బాజీ కుటుంబీకులు సిరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

10 రోజుల్లో 9 మంది చిన్నారులు మృతి



కొరాపుట్ జిల్లా నారాయణ పట్న సమితిలో బాధిత చిన్నారులకు ఇళ్ల వద్దే టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో పది రోజుల్లో 9 మంది చిన్నారులు మృతి చెందారు. జిల్లాలో బందుగాం , నారాయణ పట్న, దశమంతపూర్ సమితుల్లో చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు. అయితే ఈ వ్యాధిని డిఫ్తీరియాగా గుర్తించలేమని ప్రభుత్వ వైద్యుడు నీలకంఠ పేర్కొన్నారు. ఎక్కువగా సికిల్ సెల్, న్యూమోనియా కేసులు ఉన్నాయన్నారు. బాధిత ప్రాంతాల్లో సుమారు 250 ఇళ్లకి ప్రభుత్వ వైద్య సిబ్బంది వెళ్లి పరీక్షలు చేశారు. 56 మందికి వ్యాక్సిన్లు వేశారు. 70 కుటుంబాలను ప్రత్యేక పరిశీలనలో ఉంచారు. అవసరమైన వారికి బూస్టర్ డోస్ ఇచ్చారు. చిన్నారుల రక్త నమూనాలు భువనేశ్వర్ పంపించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న చిన్నారులను బ్రహ్మపురలోని ఎంకేసి, కొరాపుట్‌లోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలలకు తరలించారు. గ్రామాలలో సంచారక వైద్య బృందాలను ఏర్పాటు చేశారు.

దివ్యాంగురాలి మృతదేహం స్వాధీనం



కొండపై పడి ఉన్న రీనా మృతదేహం



సంఘటన స్థలం వద్ద పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుడారి పోలీసుస్టేషన్ పరిధి అంబాబడి సమీపంలోని కొండపై ఒక దివ్యాంగురాలైన యువతి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు పద్మపూర్ సమితిలోని బిరిపాదొరా గ్రామానికి చెందిన రీనా జెన్న (42)గా గుర్తించారు. సంఘటన స్థలానికి సైంటిఫిక్ బృందంతో పాటు పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం చేసేందుకు గుణుపూర్ ఆస్పత్రికి తరలించారు. గురువారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం... రీనా గత కొన్నేళ్లుగా పద్మపూర్‌లోని మిషన్ శక్తి కార్యాలయంలో కార్యకర్తగా పని చేస్తుంది. ఈ నేపథ్యంలో ఈనెల 25వ తేదీన పద్మపూర్‌లోని మిషన్ శక్తికి సంబంధించి సమావేశం ఉందని ఇంట్లో చెప్పి వెళ్లింది. అయితే అప్పటినుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వెతికారు. ఈ క్రమంలో ఒక కొండపైన దివ్యాంగురాలైన ఒక యువతి మృతదేహం పడి ఉందని సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే తమ కూతురిని ఎవరో హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు గుడారి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు హత్య జరిగిందనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

ప్రభాస్ అభిమానుల సేవ



నబరంగ్‌పూర్ లో ఆశాకిరణ్ అనాథ ఆశ్రమంలో బాలలకు ఆహారం పంపిణీ చేస్తున్న ప్రభాస్ అభిమానులు

కొరాపుట్: పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన కల్కి సినిమా విడుదల సందర్భంగా ఆయన అభిమానులు సందడి చేశారు. గురువారం వేకువ జాము నుంచే నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో థియేటర్ల వద్ద సందడి చేశారు. సినిమా హిట్ అవ్వడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశాకిరణ్ అనాథ ఆశ్రమానికి వెళ్లి అక్కడ అనాథ చిన్నారులకు ఆహారం, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభాస్ అభిమానులు అరవింద్ ప్రభాస్, ఓంకార్, మణికంఠ, సాయి చందన్ మహంతి లు ఉన్నారు.

మార్కెట్‌లో మారణాయుధంతో దాడి



దాడి జరిగిన ప్రాంతంలో విచారిస్తున్న పోలీసులు

రాయగడ: బహిరంగ మార్కెట్‌లో ఒక పదునైన మరణాయుధంతో దాడి చేసిన ఘటన జిల్లాలోని గుణుపూర్‌లో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి నిందితుడు స్వయంగా గుణుపూర్ ఆదర్శ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు. పోలీసులు, స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఒక భూవివాదానికి సంబంధించి గుణుపూర్‌కు చెందిన గోపాల్ బెహర, రమేష్ చంద్ర సాహుల మధ్య కొన్నేళ్లగా వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో రమేష్ అనే వ్యక్తి గురువారం సాయంత్రం గుణుపూర్‌లోని పాత బస్టాండు వద్దనున్న మార్కెట్‌కు కూరగాయలు ఖరీదు చేసేందుకు వెళ్లాడు. అదే మార్కెట్‌లో గోపాల అనే వ్యక్తి పైడికాయలు అమ్మే చిరు వ్యాపారి. కూరగాయలకు వెళ్లిన రమేష్‌ను చూసిన గోపాల్ భూ వివాదానికి సంబంధించి మాట్లాడాడు. ఇద్దరి మధ్య గొడవ పెద్దదై చివరకు దాడులకు దారితీసింది. ఈ క్రమంలో గోపాల్ తన వద్దనున్న ఒక పదునైన మరణాయుధంతో రమేష్‌పై దాడి చేశాడు. దానిని అడ్డుకునే క్రమంలో గోపాల్ చేతికి తీవ్రగాయమయ్యింది. దీంతో అక్కడివారు ఇద్దరిని వారించగా గాయాలు తగిలిన రమేష్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. తనను ఎలాగైనా పోలీసులు అరెస్టు చేస్తారని భావించిన గోపాల్ వెంటనే పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు.

టికిరిలో గుట్కా స్వాధీనం

రాయగడ: పికప్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న గుట్కాను టికిరి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యాన్‌ను ఆపారు. లోపల తనిఖీ చేయగా ఏడు బస్తాల గుట్కాను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ బి.బి.బాగ్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గుట్కా విలువ రూ.45 వేలు ఉంటుందని అంచనా వేశామన్నారు. డ్రైవరు పవిత్ర మాఝి, యజమాని మోహన్ పాణిగ్రహిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాజీ విగ్రహానికి సవరణలు



నబరంగ్‌పూర్‌లో స్వాతంత్ర్య సమర యోధుడు మహమ్మద్ బాజీ విగ్రహానికి సవరణలు చేస్తున్న ఐకాన్స్ ఇన్ మోషన్ ప్రతినిధులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాకి చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు మహమ్మద్ బాజీ విగ్రహానికి కొన్ని సవరణలు జరిగాయి. ఆయన విగ్రహం ప్రతిష్ఠించిన తర్వాత కింద రాసిన పేర్లు తప్పుగా పడ్డాయి. విషయం తెలుసుకున్న ఐకాన్స్ ఇన్ మోషన్ ప్రతినిధులు అక్కడకు చేరుకుని పేర్లతో తప్పులను సరిదిద్దారు.

బీజేడీ నాయకుల నిరసన



గజపతి ప్యాలస్ వద్ద నిరసన చేపడుతున్న నాయకులు

పర్లాకిమిడి: పట్టణంలో రాజవీధి రోడ్డును బాగు చేయాలని కోరుతూ బీజేడీ నాయకులు గజపతి ప్యాలస్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. రథయాత్ర నేపథ్యంలో తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, పురపాలక సంఘం చైర్మన్ నిర్మలాశెట్టి, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, పట్టణ అధ్యక్షుడు సిత్తు మహాపాత్రో, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వలస కార్మికుల సమస్యలపై

న్యాయ సచేతన శిబిరం



శిబిరంలో పాల్గొన్న గ్రామీణులు



న్యాయ సచేతన శిబిరంలో మాట్లాడుతున్న సుమన్ జెన

జయపురం: వలస కార్మికుల సమస్యలపై శుక్రవారం బొయిపరిగడ సమితి చంద్రపడ పంచాయతీ బానువగుడలో న్యాయ సచేతన శిబిరం నిర్వహించారు. శిబిరంలో న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి లోక్‌అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వలస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ప్రసంగించారు. వారి భద్రత కోసం చట్టంలో కల్పించిన సహాయాలను వివరించారు. వలస వెళ్తున్న వారు అక్కడ చాలా ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని సందర్భాల్లో వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు వలస కార్మికులుగా వెళ్లేటప్పుడు ప్రభుత్వ నియమాలు తెలుసుకోవాలని సూచించారు. శిబిరంలో జయపురం లేబర్ అధికారి చైతన్య ప్రసాద్ మరిఖి, చంద్రపడ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి భొభి ముదులి, పారాలీగల్ స్వచ్ఛంద సేవకులు రాజేశ్వర మహురియ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరాలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి నిత్యానంద, ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలోని ఏకైక వేంకటేశ్వర దేవాలయం 15వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఈ ఆలయంలో స్వామివారిని ఉదయం మంగళవాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం తిరుమనంజనం, స్వామి వారి కల్యాణం జరిగింది. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన జరిగింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండో, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, బీజేపి జిల్లా అధ్యక్షుడు జగదీష్ బిసోయిలు స్వామి వారిని దర్శించుకున్నారు.

కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ ధనుంజయ్ పట్నాయక్, నందికేశ్వర్, రవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీబస్సు సేవలు మృగ్యం



నిరుపయోగంగా పడివున్న లక్ష్మీ బస్సులు

- పర్మిట్లు లేక మూలనపడిన 11 బస్సులు

రాయగడ: గ్రామీణ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపరచాలనే ఉద్దేశంతో గత నవీన్ పట్నాయక్ ప్రభుత్వం జిల్లాలో లక్ష్మీ బస్సు పథకం సేవలను ప్రారంభించింది. గతేడాది నవంబర్ 25వ తేదీన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ లంఛనంగా వర్చువల్ మాధ్యమంలో ఈ సేవలను ప్రారంభించారు. జిల్లాలోని 11 సమితులకు ఈ సేవలు అందించాలనే ఉద్దేశంతో 52 బస్సులను ఏర్పాటు చేశారు. అయితే రూట్‌లో పర్మిట్లు లేవన్న కారణంతో 11 బస్సులు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. స్థానిక బజార్ నియంత్రణ కమిటీ (ఆర్ఎంసీ) కార్యాలయం ప్రాంగణంలో ఈ బస్సులు గత 8 నెలలుగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీనిలో కొన్ని బస్సులకు సంబంధించిన పార్ట్‌లు శిథిలావస్థకు చేరుకోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఈ సేవలు ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా రాష్ట్రంలో కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం ఈ బస్ సేవలకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఆసక్తితో ప్రజలు ఎదురు చూస్తున్నారు. అయితే గ్రామాల నుంచి పంచాయతీలకు, పంచాయతీల నుంచి జిల్లా కేంద్రానికి అనుసంధానించే సదుద్దేశంతో ప్రారంభమైన ఈ సేవలు కొనసాగుతాయా అన్న అంశం ప్రస్తుతం చర్చనీయంగా మారింది.

ఘనంగా లలితా త్రిపుర సుందరీదేవి ఆలయ వార్షికోత్సవం



ఉత్సవంలో పాల్గొన్న దంపతులు

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలో లలితా త్రిపుర సుందరీదేవి ఆలయ షష్ఠి వార్షికోత్సవం సందర్భంగా చండీయోగం, పుష్పయోగం, అష్టోత్తర కలశ స్నపనం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బహు భాషా ప్రావీణ్యులు విశాలక్ష్మీ అయ్యర్ పర్యవేక్షణలో వేదపండితులు వనమాలి మాణిక్యశర్మ, ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్ దాస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. కార్యక్రమంలో కొంచాడ ప్రవీణ్‌కుమార్, పైడిశెట్టి సుధ, అంధవరపు రవికుమార్ దంపతులు పాల్గొన్నారు.



లలితా దేవి అమ్మవారు



పూజలు చేస్తున్న వనమాలి మాణిక్యశర్మ

క్లుప్తంగా

స్వర్ణ పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు శుక్రవారం స్వర్ణపుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, తదితరులు కుంకుమార్చన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ.ప్రసాదరావు ఆధ్వర్యంలో అమ్మవారికి స్వర్ణపుష్పాలతో పూజలు చేసి, సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించి తరించారు.

అడవుల సంరక్షణలో భాగస్వామ్యం కావాలి

నెల్లిమర్ల రూరల్: అడవులను సంరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.వెంకటేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తపేట ఫారెస్ట్ పరిధిలో అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తపేటలోని 20 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 15వేల సాధారణ రకం మొక్కలను పెంచుతున్నామని చెప్పారు. అడవుల విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. పశువులు, గొర్రెల కాపరులు మొక్కలను తినకుండా జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో అప్పలరాజు, డీఆర్వో కేవీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌కు మూడేళ్లజైలు, జరిమానా

బాడంగి: భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు, రూ.పది వేలు జరిమానాను బొబ్బిలి కోర్టు విధించినట్లు కోర్టు సమన్వయాధికారి ఏఎస్సై కొండలరావు, కోర్టుకానిస్టేబుల్ జగదీష్ చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గజరాయునివలసకు చెందిన గొండేల సూరిబాబు బొబ్బిలి మున్సిపాలిటీలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నాళ్లు కాపురం చేసిన దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో భార్యను ఇబ్బందులు పెట్టేవాడు. ఈ క్రమంలో 2021 జూలై 6న కత్తితో భార్యపై భర్త దాడిచేయగా ఆమెకు తీవ్రగాయాలై రక్తస్రావం జరిగింది. దీంతో భార్య చేసిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎ.నరేష్ కేసునమోదుచేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. దర్యాప్తు అనంతరం ముద్దాయిపై చార్జ్‌షీట్ వేయగా విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయి సూరిబాబుకు బొబ్బిలికోర్టు సబ్‌జడ్జి ఎస్.అరుణ శ్రీ మూడేళ్లపాటు జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున మజ్జిజగన్నాథం వాదించారు.

కనుల పండువగా సహస్ర దీపాలంకరణ

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, నరసింహాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సారిపల్లికి చెందిన బోనుమహంతి విజయ్‌కుమార్(28) ఎలక్ట్రికల్ పనులు చేసేందుకు గ్రామానికి చెందిన కిలారి విభీషణరావు ఇంటికి వెళ్లాడు. పిట్టగోడపై ఉండి పనులు చేస్తుండగా..అదుపు తప్పి జారిపోతున్న క్రమంలో సమీపంలో ఉన్న హెచ్‌టీ లైన్ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన విజయ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి బోనుమహంతి అప్పలనరసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామగణేష్ తెలిపారు.

1న ఉద్యోగ మేళా

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని పారిశ్రామిక శిక్షణ సంస్థలో వచ్చేనెల 1న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో వివిధ ట్రేడ్లలో ఉత్తీర్ణతతో పాటు ఇంటర్‌మీడియట్, డిగ్రీ పాసైన అభ్యర్థులు ఉద్యోగ మేళాలో పాల్గొనాలని సూచించారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్, టీవీఎస్ సుందరం పార్టనర్స్, డెక్కన్ ఫెర్రో అల్లాయిస్, క్లోసివ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, రేడియంట్ ఎలక్ట్రానిక్స్, వరుణ్ జేసీబీ, టెక్ మహీంద్రా వంటి సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధిక వినియోగం ముప్పే..

- రసాయన ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- భూసారం దెబ్బతింటుంది
- విషతుల్యమైన మందులతో ప్రాణాలకు ప్రమాదం


రక్షణ చర్యలు లేకుండా రసాయన మందు పిచికారీ చేస్తున్న రైతు

భామిని : ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, చెరకు పంటల సాగులో క్రిమి సంహారక మందుల వాడకం ప్రారంభం కానుంది. అయితే దిగుబడులు అధికంగా రావాలనే ఆశతో పాటు తెగుళ్ల నివారణకు అధిక మొత్తంలో రసాయన ఎరువులు వినియోగించడం వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మిత్ర పురుగులు నశించి, భూసారం దెబ్బతిని దిగుబడి పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉందని సూచిస్తున్నారు. పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో రక్షణ చర్యలు విధిగా పాటించాలని చెబుతు న్నారు. విషతుల్యమైన పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలకే ముప్పు పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు.

సరైన మోతాదులో...

క్రిమి సంహారక మందులను సరైన మోతాదులో వాడాలి. డోస్ ఎక్కువైతే పంటకు ఉపయోగపడే జీవులు కూడా మృత్యువాత పడే అవకాశముంది. 25 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద పిచికారీ చేయడం ప్రయోజనకరం. పంటలకు తడి అందించిన అనంతరం ఉదయం వేళల్లో పురుగుమందు పిచికారీ చేయడం ద్వారా మందు ఆవిరి అవుతుంది. ఆ సమయంలో పిచికారీ చేయరాదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

✔ పురుగుమందులు పిచికారీ చేస్తున్న సమయంలో రైతులు, కూలీలు బీడీలు, సిగరెట్లు తాగరాదు.
✔ చేతులు శుభ్రం చేసుకోకుండా కళ్లు, ముక్కు, ముఖం తాకరాదు.
✔భోజనం చేసే సమయంలో చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
✔ మందులు పిచికారీ చేసిన తర్వాత ధరించిన దుస్తులను శుభ్రంగా ఉతుక్కోవాలి.
✔ విష ప్రభావానికి లోనైతే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలి. ✔ ఎటువంటి పరిస్థితుల్లోనూ నాటు వైద్యం చేయించుకోకూడదు.
✔ పిచికారీ సమయంలో శరీరం కనిపించకుండా దుస్తులు ధరించాలి.
✔ పురుగు మందులు కలిపిన ద్రావణం డబ్బా, సీసాలను కాలువలు, చెరువులలో వేయరాదు. అందులో నీటిని వేసి తాగరాదు. వాడిన పురుగు మందు డబ్బాలను రంధ్రం చేసి దూరంగా ఉంచాలి.
✔ క్రిమిసంహారక మందులను ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలి.

మాస్కులు ధరించాలి..



రైతులు క్రిమి సంహారక మందులను పిచికారి చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్క్ లేకుండా మందులు పిచికారీ చేయరాదు. పంటకు సరైన మోతాదులో మాత్రమే క్రిమి సంహారక మందులను వినియోగించాలి.

కిమిడి మన్మథరావు, ఎంఏఓ,భామిని

మోతాదు మేరకే..



సరైన మోతాదులోనే పురుగు మందులు వాడాలి. ఎక్కువ డోస్‌లో వాడితే పంటకు ఉపయోగపడే జీవులు చనిపోతాయి. పిచికారీ సమయంలో శరీరం కనిపించకుండా రక్షణ దుస్తులు ధరించాలి. క్రిమి సంహారక మందులు వాడకంపై రైతుభరోసా కేంద్రాలలో సూచనల పోస్టర్లు ప్రచురించాం. విధిగా జాగ్రత్తలు పాటించాలి.

కె. రత్నకుమారి, ఏడీఏ, పాలకొండ

యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా


సాలూరు మీదుగా తరలిస్తున్న పశువులు

సాలూరు రూరల్: ఒడిశా నుంచి సాలూరు మండలం మీదుగా మానాపురం సంతకు ప్రతివారం యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా జరుగుతోంది. పెదమానాపురంలో శనివారం జరిగే సంత లో ఇక్కడికి రవాణా అయిన పవువులను వ్యాపారులు లారీల్లో ఎక్కించి విజయవాడ తదితర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు జరుపుతారు. నేరుగా వ్యాపారులు ఒడిశాలోని వివిధ గ్రామాల్లో కొనుగోలు చేసిన పశువులను అక్కడి నుంచి కాలినడకన తరలించడానికి కూలీలను మాట్లాడుకుని వందల కిలోమీటర్లు నడిపించి మానాపురం సంతకు తరలించడం దశాబ్దాలుగా జరుగుతోంది. అయితే ఒడిశా నుంచి మానాపురం సంతకు చేరాలంటే కనీసం వంద కిలోమీటర్ల దూరం పశువులను నడిపించాల్సి ఉంది. ఈ క్రమంలో నీరసంగా ఉన్న పశువులు మార్గమధ్యంలో అలిసిపోయి రోడ్డుపై పడిపోతుంటాయి. అలా పడిపోయిన పశువులను రోడ్డు పక్కనే వదిలేసి వెళ్లిపోతారు. అంతేకాకుండా నడుస్తున్న పశువులకు కాళ్లడెక్కలు అరిగిపోయి రక్తాలు కారుతున్నప్పటికీ కొట్టి మరీ నడిపించడాన్ని చూస్తున్న జనం, జంతుప్రేమికులు అయ్యో పాపం అనుకోవడం, గోమాతకు ఇంతకష్టం కళ్ల ముందే జరుగుతున్నా పట్టించుకుని అడిగే నాథుడే లేడని బాధపడడమే తప్ప ఎవరూ ఏమీ చేసేదిలేక పోతోందని వాపోతున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఆర్‌జేడీ విజయ భాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

పార్వతీపురం టౌన్: ఉపాధ్యాయులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్‌జేడీ విజయభాస్కర్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో డీఈఓ జి.పగడాలమ్మ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాసంవత్సరానికి సంబంధించి సంవత్సర, మాసిక లెసన్‌ప్లానింగ్ అమలు చేస్తున్నారా? లేదా? అని అడిగి హెచ్ఎంలు దీనికి పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందాయా? లేదా? అన్న పర్యవేక్షణ హెచ్ఎంలు చేయాల్సిందేనని చెప్పారు. సంబంధిత పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ఆ పర్యవేక్షణ బాధ్యత కూడా హెచ్ఎంలదేనన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని హితవు పలికారు. బడిబయట పిల్లలు బడికి వచ్చేలా చర్యలు చేపట్టాలని, అందుకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేలా బాధ్యతలు చేపట్టాలని ఎంఈఓలకు సూచించారు. ఎంఈఓలు ప్రతి పాఠశాలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి పాఠశాలల్లో లోటుపాట్లను సరిచేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎంఈఓలపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సైనిక పాఠశాలలో స్విమ్మింగ్ పూల్ ప్రారంభం

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక్ పాఠశాలలో ఆధునికీకరించిన దివంగత మల్లి మస్తాన్ బాబు స్విమ్మింగ్ పూల్‌ను రియర్ అడ్మిరల్ ఎం.మురళీమోహన్‌రాజు (ఎస్ఎం,సీఎస్‌వో, పీఅండ్ ఏ ఇన్ సీఈఈ, విశాఖపట్నం) గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రియర్ అడ్మిరల్ ఎం. మురళీమోహన్‌రాజుకు ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ వింగ్ కమాండర్ కిరణ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ సీడీఆర్ అభిలాష్ బాలచంద్రన్‌లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన అనంతరం ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి మాట్లాడుతూ అత్యాధునిక స్విమ్మింగ్ పూల్, పాఠశాల పూర్వవిద్యార్థి, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన పర్వతారోహకుడు, దివంగత మల్లి మస్తాన్ బాబు జ్ఞాపకార్థం అంకితం చేశామని తెలిపారు.

కొబ్బరి తోటపై పిడుగుల వాన


పిడుగులు పడడంతో దెబ్బతిన్న కొబ్బరి చెట్లు

సంతకవిటి: సంతకవిటి మండల కేంద్రంలోని ఓ కొబ్బరి తోటపై రెండురోజుల కిందట పిడుగుల వాన కురిసింది. దీంతో పాట్నూరు కుటుంబానికి చెందిన 15 కొబ్బరి చెట్లు కాలిపోయి నష్టంవాటిల్లింది. ఇవే పిడుగులు ఇళ్లపై పడితే జననష్టం సంభవించేదని, పెద్ద ప్రమాదమే తప్పిందంటూ కొబ్బరి చెట్లను చూసిన స్థానికులు పేర్కొంటున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

భామిని: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఏకలవ్య గిరిజన మోడల్ స్కూల్ భవనాల కాంప్లెక్స్‌లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి పాడి గేదె మృతి చెందిందని బాధిత రైతు ఆరోపిస్తున్నాడు. మండల కేంద్రంలో ఏకలవ్య భవనాల మధ్య మేతకు గురువారం వచ్చిన పాడిగేదె తాత్కాలికంగా వేసిన విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టి మృతి చెందింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.30వేల విలువైన పాడిగేదెను పోగొట్టుకొన్నట్లు భామినికి చెందిన పాడి రైతు గాడో శుభాకరో వాపోతున్నాడు.

భూసేకరణ చెల్లింపులు వేగవంతం చేయండి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


హాజరైన జిల్లా అధికారులు


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని పలు ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ, పరిహారం చెల్లింపు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో భోగాపురం ఎయిర్‌పోర్టు, జాతీయ రహదారులు, రైల్వే, ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులపై ఆయా అధికారులతో శుక్రవారం సమీక్షించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులకు సంబంధించి మ్యాప్‌లను పరిశీలించారు. ఆర్‌అండ్‌ఆర్ అంశాలపై ఆరా తీశారు. ఆర్డీఓ సూర్యకళ మాట్లాడుతూ రన్ వే, అప్రోచ్ రోడ్ పనులు పురోభివృద్ధిలో ఉన్నాయని, ఆర్‌అండ్‌ఆర్ సమస్యలేమీ లేవని వివరించారు. జాతీయ రహదారులకు సంబంధించి ప్యాకేజీ-1లో మ్యుటేషన్ సమస్యలు ఉన్నాయని, 3లో రోడ్డుపై విగ్రహాలు తొలగించాల్సి ఉందని, చెల్లింపులు కొంత మేరకు పెండింగ్‌లో ఉన్నట్టు డిప్యూటీ కలెక్టర్లు తెలిపారు. రైల్వేకు సంబంధించి భూ సేకరణ జరగాల్సి ఉందని, పెదమానాపురం వద్ద గ్రామ కంఠం సేకరణకు నోటిఫికేషన్ జారీచేయాలని ఆర్డీఓ సూర్యకళ తెలపగా వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. పురిటిపెంట వద్ద చెల్లింపులు పెండింగ్ ఉన్నాయని, కోమటిపల్లి వద్ద భూసేకరణ చేయాల్సి ఉందని రైల్వే అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రైల్వేకు అవసరమైన భూ సేకరణ తక్షణమే చేయాలని, చెల్లింపులకు అవసరమైన నిధుల మంజూరుకు లేఖ రాయాలన్నారు. తారకరామ తీర్థసాగర్, తోటపల్లి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులకు నిధులు లేక ఆగిపోయాయని, కొన్నిచోట్ల భూ సమస్యలు కూడా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకురాగా జేసీ, ఆర్డీఓలు రైతులతో మాట్లాడి భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్వో అనిత, డిప్యూటీ కలెక్టర్లు ప్రమీల, మురళీజోసెఫ్, జీఎంఆర్ సంస్థ నుంచి రామరాజు, రైల్వే అధికారులు, జాతీయ రహదారులు, ఇరిగేషన్ ఇంజినీర్లు, ఆయా మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.

అనుమతి లేని.. ఆస్పత్రులపై పర్యవేక్షణ కరువు


జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆస్పత్రులు, ల్యాబ్‌లు

విజయనగరం ఫోర్ట్: సమాజంలో కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయి. ఇదే అదునుగా రోగులనుంచి కాసులు దండుకునేందుకు కొంతమంది క్లినిక్‌లు, ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు, ల్యాబ్‌లు పుట్టుకొస్తున్నాయి. ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు నిర్వహించేందుకు వైద్యారోగ్య శాఖ వద్ద కొంతమంది అనుమతి తీసుకోగా, మరి కొంతమంది ఎటువంటి అనుమతులు లేకుండా క్లినిక్‌లు, ల్యాబ్‌లు నిర్వహించేస్తున్నారు. అనుమతులు లేని వాటిపై వైద్యారోగ్య శాఖ అధికారులు దాడులు చేసి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ వైద్యాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు

ఆస్పత్రి, ల్యాబొరేటరీ, స్కానింగ్ సెంటర్ నిర్వాహించాలనుకుంటే వైద్య ఆరోగ్యశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ లేకుండా వాటిని నిర్వహించకూడదు. జిల్లాలో వైద్యారోగ్యశాఖ వద్ద 122 ఆస్పత్రులు రిజిస్టర్ అయ్యాయి. అదేవిధంగా 85 క్లినిక్‌లు, 51 డెంటల్ క్లినిక్‌లు, 64 ల్యాబ్‌లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

అనుమతులు లేకుండా నిర్వహణ

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా కొంతమంది కినిక్‌లు, ల్యాబ్‌లు గుట్టుగా నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లలో రోగులకు ఏదైనా ప్రమాదం జరిగితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అదే రిజిస్ట్రేషన్ చేయించు కుంటే రోగులకు ప్రమాద బీమా వర్తిస్తుంది. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న వాటిపై వైద్యారోగ్యశాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది మామూళ్లతో మేనేజ్ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఐదేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలి

ఆస్పత్రులు గాని, ల్యాబ్‌లు గాని, స్కానింగ్ సెంటర్లు గాని 5 ఏళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలి. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే దాని కాలపరిమితి 5 ఏళ్ల వరకు ఉంటుంది. ఆ తర్వాత రెన్యువల్ చేయించుకోవాలి.

ఫీజుల వివరాలు

సోలో క్లినిక్‌కు రూ.1250, పాలిక్లినిక్‌కు రూ.2500, 20 పడకల ఉన్న ఆస్పత్రి అయితే రూ.3750, 21నుంచి 50 పడకల ఆస్పత్రి రూ.7500, 50 నుంచి 100 పడకల ఆస్పత్రి అయితే రూ.10 వేలు, 21 నుంచి 100 పడకలు అయితే రూ.10 వేలు, 101 నుంచి 200 పడకలకు అయితే రూ.15000, 200కు పైగా పడకలు ఉన్న ఆస్పత్రికి రూ.37,500, ల్యాబొరేటరీకి రూ.2500, డయాగ్నోస్టిక్ సెంటర్, ఎక్స్‌రే, సి.టిస్కాన్ సెంటర్‌కు రూ.10,000, ఫిజియో థెరపి క్లినిక్‌కు రూ.3750 ఫీజు చెల్లించాలి.

అనుమతి లేకపోతే సీజ్

ఆస్పత్రి, క్లినిక్, ల్యాబ్ ఏది నిర్వహించాలన్నా వైద్యారోగ్య శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఎక్కడైనా అనుమతులు లేకుండా ఆస్పత్రి, ల్యాబ్‌లు నిర్వహిస్తున్నరని తెలియజేస్తే అటువంటి వాటిని సీజ్ చేస్తాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్ఓ

శివారు భూములకు సాగునీరు అందిస్తాం

- రాష్ట్ర శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి
- తోటపల్లి కుడిప్రధాన కాలువకు సాగునీరు విడుదల


తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీరు సరఫరాకు మీటనొక్కుతున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు


కాలువకు హారతిస్తున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు

పార్వతీపురం: సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు నుంచి శివారు భూములకు సాగునీరు సరఫరా చేస్తామని రాష్ట్ర శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువకు కురుపాం, పాలకొండ, పార్వతీపురం ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ, బోనెల విజయ్‌చంద్రతో కలిసి శుక్రవారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలువ వద్ద శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. నదికి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ కాలువల్లో పూడికలు, తుప్పలను తొలగించి సాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. గరుగుబిల్లి మండల ప్రజలకు సాగునీరు సరఫరాకు అవసరమైన ప్రతిపాదనలు చేయాలని సూచించారు. తోటపల్లి, జంఝావతి, పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పనులను పూర్తిచేసేందుకు చర్యలు చేపడతామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. ఐటీడీఏలు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని, అవసరమైన నిధులను తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రిని కలుస్తామని చెప్పారు. ఏనుగుల తరలింపు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ రైతులు పంటలు వేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఉత్తర కోస్తా జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరు ఎస్.సుగుణాకర్‌రావు, పర్యవేక్షక ఇంజినీరు రాజరాజేశ్వరి, కార్యనిర్వాహక ఇంజనీర్లు జి.రామచంద్రరావు, ఆర్.అప్పలనాయుడు, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు టి.రఘునందన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఆయకట్టు ఇలా...

తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, పాత కుడి, ఎడమ కాలువల ద్వారా 1,31,221 ఎకరాలకు సాగునీరు సరఫరా చేయాలని ఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో పార్వతీపురం మన్యం జిల్లాలో బలిజిపేట, సీతానగరం మండలాల్లోని 27 గ్రామాల పరిధిలోని 13,684 ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల, జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాల్లోని 105 గ్రామాల పరిధిలోని 38,975 ఎకరాలకు, విజయనగరం జిల్లాలోని రాజాం, వంగర, చీపురుపల్లి, గరివిడి, గుర్ల, నెల్లిమర్ల, పూసపాటిరేగ, బొబ్బిలి, బాడంగి, తెర్లాం, వంగర మండలాల్లోని 66 గ్రామాల పరిధిలోని 25,060 ఎకరాలకు సాగునీరు సరఫరా చేయనున్నారు. అలాగే, ప్రాజెక్టు పాత రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల ద్వారా 64 వేల ఎకరాలకు సాగునీరు సరఫరాచేయాల్సి ఉంది.

సాగునీటి సమస్యలు పరిష్కరించండి

గరుగుబిల్లి: జిల్లాలో ఉన్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి, రైతుల సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వద్ద నిర్వహించిన సమావేశం అనంతరం ఆమె దృష్టికి సాగునీటి సమస్యలను తీసుకెళ్లారు. వెంగళరాయ సాగర్, పెద్దగెడ్డ, రావాడగెడ్డ, తోటపల్లి ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ, పెదబుడ్డిడి వద్ద ఆక్విడెక్ట్ పెండింగ్ పనులు, భామిని మండలం కొండలోయ గెడ్డ, వడ్డంగి లిఫ్టిరిగేషన్ పనులకు నిధులు మంజూరుచేసి పనులు చేపట్టాలని కోరారు. ఒడిశా ప్రభుత్వంతో జంఝావతి ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులను తొలగించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి 24 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యమిచ్చి పనులు పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట రైతు సంఘ నాయకులు ఇ.వి.నాయుడు, లక్ష్మీనారాయణ, వైకుంఠరావు, గౌరునాయుడు ఉన్నారు.